
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025

పంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ కోసం పటిష్టమైన భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 36 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్నామని, నేరచరిత్ర ఉన్న 46 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని, లిక్కర్ అక్రమ రవాణాపై 54 కేసులు నమోదు చేశామని తెలిపారు. లైసెన్స్ కల్గిన ఏడు తుపాకులను డిపాజిట్ చేయించామని అన్నారు. బెల్ట్ షాపులను మూయించామన్నారు.



విద్యుత్ వెలుగుల్లో గ్లోబల్ సమ్మిట్ వేదిక

భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు మయసభను తలపించేలా ఉన్నాయి. రంగురంగుల పూల మొక్కలు.. స్వాగత తోరణాలు.. విద్యుత్‌దీపాలు.. హోర్డింగ్‌లు.. అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు.. ఎల్‌ఈడీ స్ర్కీన్లు.. ఇలా అక్కడినుంచి కనుచూపు మేర ఎటూ చూసినా ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. తెలంగాణ విజన్- 2047ను ఆవిష్కరించేలా ఈ సదస్సు ఏర్పాట్లు 'న భూతో న భవిష్యత్' అన్నట్లుగా తీర్చిదిద్దారు. ఈ ఏర్పాట్లతో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్ఖాన్‌పేట్- బేగరికంచె ప్రాంతం ఫ్యూచర్ సిటీ ఆవిష్కరణకు నాంది పలుకుతోంది.

గ్లోబల్.. జిగేల్

- మయసభను తలపించేలా సమ్మిట్‌కు ఏర్పాట్లు
- దేశ, విదేశ దిగ్గజాలకు అదిరేలా ఆతిథ్యం
- కళకళలాడుతున్న రోడ్లు, భవనాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు
- చుట్టూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల హోర్డింగ్‌లు
- తుది దశలో ఏర్పాట్లు.. నేడు ట్రయల్‌రన్
- ఫ్యూచర్ సిటీ అథారిటీ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్/ కందుకూరు /మహేశ్వరం/ఇబ్రహీంపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ థీమ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ దేశాల్లోని దిగ్గజ వ్యాపార సంస్థలను ఫ్యూచర్‌సిటీలో నెలకొల్పేలా ప్రయత్నాలు చేస్తోంది. ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సును అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్‌సిటీ వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేష గుర్తింపు పొందిన దిగ్గజ సంస్థలను ఆహ్వానించింది. సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి చేసేందుకు 26శాఖల అధికారులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. దేశ, విదేశాల నుంచి విచ్చేసే దిగ్గజ పారిశ్రామికవేత్తలు, కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ, క్రీడా, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, విద్యారంగాలకు చెందిన వారు, విదేశీ రాయబారులు, ఆయా దేశాలకు చెందిన నిష్ణాతులు

మిగతా 6వ పేజీలో...



ఎల్‌ఈడీ వెలుగులు

చుట్టూ పల్లె వాతావరణం

మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటు చేస్తోన్న గ్లోబల్ సమ్మిట్‌ను పల్లె వాతావరణం ఉండేలా చిన్నచిన్న గుట్టల మధ్య వేదికను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మూడు వైపులా డిజిటల్ తెరల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రగతి చిత్రాలు ప్రదర్శించేలలా డిజిటల్ టన్నెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సదస్సు వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సభా వేదికతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, వంట గది, చర్చల గదులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారుల సమక్షంలో ఒప్పందాలను చేసుకునేందుకు ప్రత్యేక చాంబర్లను ఏర్పాటుచేశారు.

ప్రత్యేకంగా స్టాళ్ల ఏర్పాటు

సభావేదిక పక్కన ప్రత్యేకంగా ప్రముఖ దిగ్గజ సంస్థలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లలో హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు దేశ, విదేశాల నుంచి విచ్చేసిన అతిథులకు చూపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, మహిళా ప్రగతి, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలో కూడిన సంస్థలు నెలకొల్పడం వంటి వాటిపై స్టాళ్లను ఏర్పాటు చేశారు.



విద్యుత్ వెలుగుల్లో సమ్మిట్ జరిగే ప్రాంతం



అతిథుల కోసం ఏర్పాట్లు



సమ్మిట్‌కు వెళ్లే రోడ్డు మధ్యలో పూల మొక్కలు



డాగ్ స్క్వాడ్ తనిఖీలు

అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే

పేదల జీవితాల్లో వెలుగులు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూరదృష్టితోనే చట్టబద్ధంగా పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిప్రాయపడ్డారు. శనివారం షాద్‌నగర్‌లో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ క్యాడర్, ప్రజా సంఘాలతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే పేదలకు రిజర్వేషన్లు వర్తించాయన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి రంగాలలో అవకాశాలు వచ్చి ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, జి.బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, టి.కరుణాకర్, బాదేపల్లి సిద్దార్థ, ఎస్‌డీ ఇబ్రహీం, నలమోని శ్రీధర్, కరోళ్ళ సురేందర్, జాంగారి రవి, సింగపాగ అనిల్‌కుమార్, జనార్ధన్, నక్క బాల్‌రాజ్, నర్సింహులు, అర్జునప్ప, రవీంద్రనాథ్, రాము పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో

విద్యార్థులు రాణించాలి

- ఇస్రో శాస్త్రవేత్త రాఘునందన్‌కుమార్



చేవెళ్లలో రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇస్రో శాస్త్రవేత్త రాఘునందన్‌కుమార్, విద్యాశాఖ అధికారులు

చేవెళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రసాంకేతిక రంగాల్లో విద్యార్థులు అవగాహన పెంచుకొని ముందుకు సాగాలని ఇస్రో శాస్త్రవేత్త రాఘునందన్ కుమార్ తెలిపారు. చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లో శనివారం రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. రాష్ట్ర తెలంగాణ మోడల్ స్కూల్ అడిషినల్ డైరెక్టర్ శ్రీనివాసచారి, డీఈవో సుశీంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు సాధించే విధంగా తయారు కావాలని పిలుపునిచ్చారు. భారత అంతరిక్ష పరిశోధన రంగం నూతన ఆవిష్కరణల కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. 2035 నాటికి ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా రూపాంతరం చెందేవిధంగా కార్యాచరణ కొనసాగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి వైర్‌లెస్ లేకుండానే ఇంటర్‌నెట్ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. చంద్రయాన్-1, 2, 3 విజయవంతంగా నింగిలోకి పంపించడం జరిగిందన్నారు. కాగా చంద్రయాన్-4ను నింగిలోకి పంపి పరిశోధన దిశగా కార్యాచరణ శ్రీహరికోటలో సిద్ధం అవుతుందన్నారు. సముద్రంలో వస్తున్న మార్పుల మూలంగానే తుఫాన్‌లు వస్తున్నాయన్నారు. దీనివలన ప్రాణనష్టం జరుగకుండా ఉండేందుకు పరిశోధనలు సాగుతున్నాయన్నారు. ఈనెల 15వ తేదీన ఎల్‌వీఎం మిషన్ (6 లక్షల 40వేల కిలోల) నింగిలోకి పంపబోతున్నామన్నారు. అలాగే 19వ తేదీన 3ఐ అట్లాస్‌ను నింగిలోకి పంపబోతున్నామన్నారు. విద్యార్థులకు టీవీల్లో చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రానున్న రోజుల్లో స్పేస్ టెక్నాలజీకే ఫ్యూచర్ ఉండబోతుందన్నారు. అంతకు ముందు రాష్ట్ర తెలంగాణ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు మాట్లాడుతూ.. మొత్తం 194 మోడల్ స్కూల్ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చేవెళ్ల ఎంఈవో పురందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ఎన్నికలపై సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

చౌదరిగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల విధుల్లో నోడల్ అధికారులు అలసత్వం చూపొద్దని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. నామినేషన్ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 48గంటల వరకు 144సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంక్యానాయక్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

కొందుర్గు : పంచాయతీ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిషత్ ఆవరణలో రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మాస్టర్ ట్రైనింగ్ శిక్షకులు లక్ష్మీనారాయణ, ఆశీర్వాదం, బాలాజీ, వివిధ మండలాల పీవో, ఏపీవోలు 250 మంది శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ అనురాధ, గణపతి, ఏపీవో నర్సింగ్ రావు, పాల్గొన్నారు.

పీఓ శిక్షణ తరగతుల్లో

ఆలస్యంగా భోజనం

- ఆగ్రహంతో ఊగిపోయిన ఉపాధ్యాయులు
- సరిపడా వడ్డించలేదని ఎంపీడీవోపై ఆగ్రహం



చౌదరిగూడలో మధ్యాహ్న భోజనం రాలేదంటూ ఎంపీడీవోను నిలదీస్తున్న ఉపాధ్యాయులు

చౌదరిగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులకు పీఓ, ఏపీవోలకు చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు మధ్యాహ్నం 2గంటలు దాటినా భోజనం రాకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి అన్నం పెట్టారా..? అంటూ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌పై మండిపడ్డారు. 2:30 నిమిషాలకు అన్నం వచ్చినా సరిపడా వడ్డించలేదని కొందరు ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మరికొందరు పేట్లలో అన్నం చూపుతూ కర్రీస్ లేవు.. ఎలా తినాలి? అని ప్రశ్నించారు. ముందుగా చెబితే తామే బాక్స్‌లు తెచ్చుకునే వాళ్లం కదా..? అంటూ మండిపడ్డారు. భోజనం కోసం అందరూ ఉపాధ్యాయులు ఒకేసారి క్యూలో రావడంతో తహసీల్దార్ జగదీశ్వర్, ఆర్ఐ సలీంలు భోజనం వడ్డించారు. ఇదే విషయమై ఎంపీడీవోను ఫోన్‌లో సంప్రదించగా.. రాత్రి ఆలస్యంగా చెప్పారు. వంట చేసే వారు సకాలంలో అందుబాటులోకి రాలేదని సమాధానం ఇచ్చారు.

ఐదు సర్పంచ్, 65 వార్డులు ఏకగ్రీవం

చేవెళ్ల డివిజన్‌లో ముగిసిన ఉపసంహరణ


చేవెళ్ల డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెండవ విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల డివిజన్‌లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ పరిధిలో మొత్తం 109 గ్రామాలు, 946 వార్డులు ఉన్నాయి. ఇందులో ఐదు గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా, మిగిలిన 105గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. చేవెళ్ల మండలంలో 25 గ్రామాలకు గాను రెండు గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా, 23 గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. 218 వార్డులకు గాను 35 మంది వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 183 వార్డుస్థానాలకు ఎన్నికలు జరుగనుండగా 470 మంది అభ్యర్థులు వార్డు స్థానాల్లో పోటీ పడుతున్నారు. అయితే చేవెళ్ల మండలంలోని చన్వల్లి గ్రామ సర్పంచ్‌గా జి. ప్రభాకర్‌రెడ్డి ఏకగ్రీవం అయ్యారు. అలాగే మీర్జాగూడ గ్రామంలో మొత్తం 8 వార్డులతోపాటు సర్పంచ్ పి. సుష్మ మల్లేష్ ఏకగ్రీవం అయ్యారు. శంకర్‌పల్లి మండలంలో 24 గ్రామ గ్రామాలకు గాను ఇద్దరు సర్పంచ్‌లు, 21 మంది వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మొయినాబాద్ మండలంలో 19 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం వార్డులు 166 వార్డులు ఉండగా, ఇందులో 9 వార్డులు ఏకగ్రీవం కాగా.. 157 వార్డు స్థానాలకు గాను 621 మంది వార్డు సభ్యులు ఎన్నికల బరిలో ఉన్నారు. షాబాద్ మండలంలో 41 పంచాయతీలకు గాను చర్లగూడ గ్రామం ఏకగ్రీవం కాగా, 40 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని ఎన్నికల అధికారులు తెలిపారు.



అన్నా.. బాగున్నావే..

- వలస ఓటర్లతో ఫోన్లో సంప్రదింపులు
- ముందుగానే మాట తీసుకుంటున్న అభ్యర్థులు
- రాకపోకల రవాణా, ఇతర ఖర్చుల చెల్లింపు
- ఒక్కో పంచాయతీలో 30శాతం పైనే వలస ఓటర్లు
- అందరినీ గ్రామానికి రప్పించేలా ప్రణాళిక
- గిరిజన పంచాయతీల్లో వలస ఓటర్లే నిర్ణేతలు
- గెలుపోటముల్లో కీలకం కానున్న ఒక్కో ఓటు

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఒక్కో ఓటును ఒడిసి పడుతున్నారు. ఓటర్లను తమవైపు మలుపుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. స్థానిక ఓటర్లతో పాటు ఉద్యోగ, జీవనోపాధి రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస ఓటర్లపై ప్రత్యేక నజర్ పెట్టారు. వారితో ఫోన్‌లో మాట్లాడుతూ తమకు ఓటు వేయాలంటూ హామీ తీసుకుంటున్నారు. ముందుస్తుగానే రాకపోకలకు రవాణా చార్జీలు చెల్లిస్తూ ఎలాగైనా ఓటు వేసేందుకు గ్రామానికి రప్పించేలా ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా గిరిజన పంచాయతీల్లో వలస ఓటర్లే గెలుపోటములను నిర్దేశించనున్నారు.



అభ్యర్థి, ఓటరు సంభాషణ ఇలా..

అభ్యర్థి: హలో.. అన్న బాగున్నావే..?
ఓటరు: అన్న నేను బాగున్న.. నువ్వెట్లున్నవ్?
అభ్యర్థి: అన్న.. నేను మన ఊరి సర్పంచ్‌గా పోటీ చేస్తున్న.. మీ సహకారం కావాల్నే.
ఓటరు: సంతోషమన్న.. నేను మీ వెంటే ఉంట
అభ్యర్థి: అవును.. నీవు హైదరాబాద్‌లో ఎక్కడ ఉంటున్నవే..
ఓటరు: ఎల్‌బీ నగర్‌లో ఉంటున్నమే..
అభ్యర్థి: ఎలాగైనా మీరంతా నాకు ఓటు వేసి గెలిపించాలి..
ఓటరు: తప్పకుండా ఓటు వేస్తాం.. అన్న..
అభ్యర్థి: రేపో ఎల్లుండో నేను అక్కడికి వచ్చి కలుస్త.. ఉంటనే మరి
ఓటరు: సరే అన్న.. కలుద్దాం..

వికారాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్పంచ్ ఎన్నికల్లో ఒక్క ఓటుకు కూడా అదృష్టాన్ని తారుమారు చేసే శక్తి ఉంటుంది. దీంతో ఏ ఓటు కూడా చేజారకుండా అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటు విలువ తెలిసిన అభ్యర్థులు ప్రతీ ఓటు తమకే పడేలా ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికంగా ఉంటున్న ఓటర్లతో పాటు వలస ఓటర్లను ఎన్నికల కోసం సొంత గ్రామాలకు రప్పించేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లందరూ ఎన్నికల పోలింగ్‌కు కనీసం ఒక రోజు ముందుగానే గ్రామాలకు వచ్చేలా తమ అనుచరులతో వ్యూహరచన

మిగతా 6వ పేజీలో...


గో సంరక్షణతోనే పాడి పంట

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోవుల సంరక్షణతోనే పాడి, పంటలు పుష్కలంగా ఉత్పత్తికాబడి ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని పౌల్ట్రీ పారిశ్రామికవేత్త జి.వసంతరావు అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట శ్రీకృష్ణ గోశాలకు శనివారం ట్రాక్టర్ పశుగ్రాసాన్ని ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గోవధతో దేశవాళి పశు సంపద రోజురోజుకు తగ్గిపోతోందని, ఇది సమాజానికి విఘాతమని పేర్కొన్నారు. పశు సంపద తగ్గి కల్తీపాలు, రసాయనిక ఉత్పత్తులు పెరిగి ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారని వాపోయారు.









(ఐదో పేజీ తరువాయి)

గ్లోబల్.. జిగేల్

ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. వీరికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆతిథ్యం అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. ఈ సమావేశానికి దేశ, విదేశాల నుంచి దాదాపుగా 2,500మంది అతిథులు హాజరుకానున్నారు. వీరితో కీలక చర్చలు జరిపేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎల్ఈడీ స్క్రీన్లతో సభా వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. సమ్మిట్ నిర్వహణపై నేడు అధికారులు ట్రయల్ రన్ చేపట్టనున్నారు. ఈ ప్రాంగణమంతా అతిథులను రకరకాల పూల మొక్కలతో స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదికలకు వచ్చే ఆయా ప్రాంతాల్లో పచ్చదనం ఉండేలా గడ్డిని నాటారు. అతిథులను ఆకట్టుకునేలా రకరకాల పూల మొక్కలను నాటారు. గోబల్ సమ్మిట్ ప్రాంతమంతా పచ్చని చెట్లతో కళకళలాడుతోంది.

వందల మంది ఆర్కిటెక్టర్లతో పనులు...

అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేసేందుకు దేశంలోని ప్రముఖ ఆర్కిటెక్టర్లను పిలిపించింది. అన్ని శాఖల పరిధిలో దేశ, విదేశాల నుంచి విచ్చేసిన అతిథులకు ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసేందుకు గానూ తగిన ప్రణాళికలు రూపొందించారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకుగానూ ప్రత్యేక డిజైన్లతో సభావేదికలను ఏర్పాటు చేశారు.





సుందరంగా తీర్చిదిద్దిన అంతర్గత దారులు

పగలు, రాత్రి తేడా లేకుండా శ్రమిస్తున్న అధికార యంత్రాంగం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గ్లోబల్ సమ్మిట్‌కు సమయం దగ్గర పడడంతో వివిధ శాఖలకు సంబంధించిన రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు జిల్లా, డివిజన్, మండల అదికారులు తగిన ఏర్పాట్లను మరితం ముమ్మరం చేశారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ ఎండీ శశాంక పర్యవేక్షణలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పనులను ముమ్మరం చేయడంతో సమ్మిట్ పనులు తుది దశకు చేరాయి. వివిధ శాఖల అధికారులు ఉండేందుకు కూడా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను శ్రీశైలం - హైదారాబాదు ప్రధాన రహదారి కొత్తూరు గేటు సమీపంలో గుడారాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని సుమారు 25 శాఖలకు సంబంధించిన అధికార యంత్రాంగం మొత్తం సమ్మిట్ పనుల పర్యవేక్షణలో ఉన్నారు. అదే విధంగా రోడ్డుకిరువైపులా తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రకటన పేరుతో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సమ్మిట్ పనులను నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డితో పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే, కేఎల్లార్ మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్ తో మహేశ్వరం మహానగరంగా మారనుందన్నారు.



అదనపు ఆకర్షణగా నూతన, వింటేజ్ వాహనం

గ్లోబల్ సమ్మిట్‌కు పూర్తి ఏర్పాట్లు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పనులు శనివారం సాయంత్రం వరకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అక్కడక్కడ మిగిలిన పనులను ఆదివారం మధ్యాహ్నం వరకు పూర్తి చేయడానికి 25 శాఖల ప్రభుత్వ ఉన్న తాధికారులు సమష్టిగా పనులను వేగవంతం చేశారు. ప్రముఖుల రాక నేపథ్యంలో గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతాన్ని డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. ఇక్కడ నాలుగు చోట్ల సెల్ టవర్స్‌లను ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని వివరించేలా 40 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎనిమిది స్థానాల్లో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు 6 మొబైల్ మరుగుదొడ్లను సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ప్రముఖులు వచ్చేందుకు సమ్మిట్ ప్రాంగణానికి కిలోమీటర్ దూరంలో మూడు హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేశారు. సుమారు 100 ఎకరాలలో ఉన్న సమ్మిట్ ప్రాంగణం చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేశారు. గుడారాల చుట్టూ బీటీ రోడ్లు, వాటి మధ్యలో విద్యుత్ లైట్లు, మొక్కలను నాటారు. శనివారం గ్లోబల్ సమ్మిట్ పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, అడిషనల్ డీజీపీ మహేష్‌భగవత్, డీఎస్‌చౌహాన్, ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్, ఐజీ రమేష్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారికి ఇక్కడ జరుగుతున్న పనుల గురించి ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ శశాంక, ఆర్అండ్‌బీ ఎండీ అశోక్‌రెడ్డి తోపాటు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన హైలెట్స్

- సాయంత్రం 5:00గంటలకు సీఎం హెలికాప్టర్‌పై గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంపై నుంచి రెండు రౌండ్లు ఏరియల్ సర్వే చేశారు
- 5:03 గంటలకు హెలీప్యాడ్ వద్ద హెలీకాప్టర్ ఆగింది.
- 5:19 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయి గ్లోబల్ సమ్మిట్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంది.
- 5:23గంటలకు సీఎం వచ్చిన హెలీకాప్టర్ హైదరాబాద్ చేరుకుంది.
- 6:30 గంటల వరకు గ్లోబల్ సమ్మిట్‌లో జరుగుతున్న పనులను ంత్రి పోగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డిజిపి శివధర్‌రెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
- 6:35 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్(రోడ్డు మార్గం) ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరింది.

తుక్కుగూడ నుంచి సమ్మిట్ వరకు రోడ్ల మరమ్మతులు

మీర్ఖాన్‌పేటలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ కోసం రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కందుకూరు మండలం కొత్తూరు గేటు మీదుగా సమ్మిట్ జరిగే ప్రదేశం వరకు ఉన్న రోడ్డును బాగు చేయడంతో పాటు ఇరువైపులా మొక్కలు నాటారు. అలాగే సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.



సమ్మిట్ నిర్వహించే ప్రదేశ ఏరియల్ వ్యూ



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు



నమూనా వస్తువులను తీసుకెళ్తున్న సిబ్బంది



వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానం పలికే ప్రాంగణం



ఇందిరా మహిళా శక్తి భవనం నమూనా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ రవి, నాయకుడు కేఎల్లార్



రోడ్లకు ఇరు వైపులా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, పూల మొక్కలు

ధర్మాచరణతో సమాజ శాంతి స్థాపన

తలకొండపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):సమాజ శాంతినికాంక్షించి ప్రతి ఒక్కరు ధర్మాచరణతో ముందుకు సాగాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, యజ్ఞ యాగాలు మానవాళి సన్మార్గ పురోగమనానికి దోహద పడుతాయని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో శనివారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి 30వ వార్షికోత్సవం, శ్రీమద్భగవద్గీత జయంతి సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించారు. రిటైర్డ్ టీచర్ జంగయ్యయాదవ్ స్మారకార్థం నిర్వహించిన కార్యక్రమానికి వివిద ప్రాంతాల నుంచి ఆశ్రమ పీఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలు, కవులు, కళాకారులు తరలివచ్చారు. జైపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఉమ్మెంతల మహేశ్వర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. హోమం, సప్తాహ మహోత్సవంలో గంగాపురం మళయాల స్వామి లక్ష్మీనారాయణ స్వామి ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మనంద గిరి స్వామి కావేరమ్మపేట అష్టలక్ష్మి ఆలయ అధిపతి ఆచార్య కృష్ణానంద స్వామి, పోతులమడుగు సీతారామాంజనేయ స్వామి ఆశ్రమ పీఠాదిపతి చరణ్‌స్వామి, తొమ్మిది రేకుల కిషన్ ప్రభు ఆశ్రమ నిర్వాహకుడు అమృతానంద గిరిస్వామి, ముక్తేశ్వరానంద గిరిస్వామి, శంకరయ్యస్వామి, లావణ్య స్వామి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యజ్ఞం, హోమం, పారాయాణాలు, శ్రీమద్భగవద్గీత సప్తాహోత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా భగవద్గీత పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జైపాల్‌యాదవ్

ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

కేశంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నిర్వహించాలని ఎన్నికల శిక్షణాధికారులు శరత్ చంద్ర, హరిప్రసాద్ సూచించారు. అల్వాల రైతు వేదికలో శనివారం ఆర్వో, జోనల్, స్టేజ్-2 అధికారులకు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లో ఏమైనా తప్పులు ఉంటే ముందే సరిచూసుకోవాలని వివరించారు. ఓటింగ్ సమయంలో ప్రతి ఓటరును ఇంకు గుర్తు పెట్టాలని తెలిపారు. శిక్షణలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.






అన్నా.. బాగున్నావే..!

(ఐదో పేజీ తరువాయి)

చేస్తున్నారు. తమ ఓటర్లలో ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారనే వివరాలను సేకరించిన అభ్యర్థులు వలస ఓటర్లతో రోజుకు ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని వారు అభ్యర్థిస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో ఓటర్లుంటే వారి వద్దకు తమ సన్నిహతులను పంపించి తమకే ఓటేసేలా వ్యక్తిగతంగా ముఖాముఖిగా మాట్లాడిస్తున్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే గ్రామాలకు చేరుకునేలా రవాణా సదుపాయం కల్పిస్తున్నారు. ఎక్కువ మంది ఉంటే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు ఓటర్లు ఉంటే రాకపోకలకు రవాణా ఖర్చులతో ఇతర ఖర్చులూ ముందుగానే ముట్టచెబుతున్నారు. ఆలస్యం చేస్తే తమ ప్రత్యర్థుల వలస ఓటర్ల నుంచి ఎక్కడ మాట తీసుకుంటారనో.. లేక కలుస్తారోనని ఎవరికి వారు సంప్రదింపులు ముమ్మరం చేశారు.

గిరిజన గ్రామాల్లో 70శాతం వరకు..

ఎన్నికలు జరిగే పంచాయతీల్లోని ఓటర్లలో 30 శాతంపైగా ఓటర్లు ఉద్యోగ, వృత్తి, జీవనోపాధికి ఇతర ప్రాంతాల్లో నివసిస్తుండగా, గిరిజన పంచాయతీల్లో మాత్రం 70 శాతం వరకు హైదరాబాద్, పుణే, ముంబై తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ పరిస్థితి తొలి విడత జరగనున్న అన్ని మండలాల్లోనూ నెలకొంది. ఉపాధి కోసం అక్కడ నివాసం ఉంటున్నా వారి ఓటు హక్కు మాత్రం సొంత గ్రామాల్లోనే నమోదు చేసుకున్నారు. అయితే ఉపాధి కోసం తమ గ్రామాల్లోని ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారో ఇప్పటికే గుర్తించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో కొందరు నేరుగా మాట్లాడుతుండగా, కొందరు స్థానికంగా ఉండే వారి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడిస్తున్నారు.



గుడ్‌విల్ సైతం ఇచ్చేలా ఒప్పందం

ఒక్కో ప్రాంతంలో ఉన్న ఓటర్లు తమ గ్రామానికి వచ్చేందుకు రవాణా ఖర్చులతో పాటు ఓటర్ల లెక్కన గుడ్‌విల్ సైతం ఇచ్చే విధంగా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఓటర్ల సంఖ్య మేరకు వారికి రవాణా ఖర్చులు, గుడ్‌విల్ ముందుగానే అందజేస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో ఓటర్లుంటే వాహనాలు ఏర్పాటు చేసి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ కూలి పనులు చేసుకునే వారికి వారు ఇక్కడికి రావడం వల్ల నష్టపోయే కూలి డబ్బులు కూడా చెల్లించేందుకు అభ్యరులు సిద్ధపడుతున్నారు. సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు తమకే ఓటు వేయాలంటూ వారిని అభ్యర్థిస్తున్నారు.

తొలి విడతలో నువ్వా.. నేనా..

జిల్లాలో ఎనిమిది మండలాల్లో 11వ తేదీన తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. తాండూరు, బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల్లోని 262 పంచాయతీలు, 2,198 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, నామినేషన్ల ఉప సంహరణ, ఏకగ్రీవాల అనంతరం 224 సర్పంచ్ పదవులకు 639 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, 1,542 వార్డుల బరిలో 3,772 మంది అభ్యర్థులు నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పలు పంచాయతీల్లో నువ్వా.. నేనా.. అన్న విధంగా పోరు తీవ్రంగా మారింది. కొన్ని పంచాయతీల్లో ద్విముఖ పోటీ ఉండగా, కొన్ని పంచాయతీల్లో త్రిముఖ, మరికొన్ని పంచాయతీల్లో చతుర్ముఖ పోటీ నెలకొంది.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

చౌదరిగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రావిర్యాల, కాస్లాబాద్ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



రూ.70వేల విలువైన మద్యం పట్టివేత



యాచారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నాగార్జున సాగర్-హైదరాబాద్ రహదారిపై మాల్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.70వేల విలువైన అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మర్రిగూడ మండలం అజ్జిలాపూర్‌నకు చెందిన ఓ వ్యక్తి కారులో మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు కారును, 24 కాటన్ల మద్యాన్ని పట్టుకున్నారు. అజ్జిలాపూర్‌లో ఓటర్లకు పంచేందుకు మద్యాన్ని తరలిస్తున్నట్లు తెలిసింది.

పదవులకు రాజీనామాలు.. వార్డులకు నామినేషన్లు



కులకచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల పదవులకు రాజీనామాలు చేసి మహిళలు నామినేషన్లు వేశారు. బండవెల్కిచర్ల సమాఖ్య కార్యదర్శి కవిత, ముజాహిద్‌పూర్‌లో కార్యదర్శి భవానీ (అరుణ), చెల్లాపూర్‌లో కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి కె.లక్ష్మి వార్డులకు నామినేషన్లు వేశారు.

కులకచర్ల మండలంలో వెయ్యిలోపు ఓటర్లున్న గ్రామాలే అధికం



కులకచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలో అధికంగా వెయ్యి లోపు ఓటర్లు ఉన్న పంచాయతీలే ఉన్నాయి. మండలంలో 33 పంచాయతీలు ఉండగా 13 పంచాయతీల్లో వెయ్యి లోపే ఓటర్లున్నారు. హన్మ్యనాయక్ తండాలో 6వార్డుల్లో అతి తక్కువ 239 మంది ఓటర్లు ఉన్నారు. లాల్‌సింగ్ తండాలో 6వార్డులకు 352, దీప్లనాయక్ తండాలో 398, ఎత్తుకాల్వ తండాలో 437, ఎర్రగోవింద్ తండాలో 440, చాపలగూడెంలో 516, చెరువు ముందలి తండాలో 563, బిందెంగడ్డ తండాలో 577, దాస్యనాయక్ తండా(ఎ)లో 583 మంది, బోట్యనాయక్ తండాలో 626, రాంరెడ్డిపల్లిలో 629, రాంనగర్‌లో 720, గోరిగడ్డ తండాలో 740, బండమీదితండాలో 750, పీరంపల్లిలో 803, అనంతసాగర్‌లో 944 మంది చొప్పున ఓటర్లు ఉన్నారు.

విత్‌డ్రాలు, గుర్తుల కేటాయింపు వరకు అప్రమత్తంగా ఉండాలి



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకురాలు యాస్మిన్ బాషా

కులకచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల ఉపసంహరణలు, పోటీలో నిలిచే వారికి గుర్తుల కేటాయింపు వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ ఎన్నికల పరిశీలకురాలు యాస్మిన్‌బాషా తెలిపారు. శనివారం కామునిపల్లిలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా స్ర్కూటినీ సజావుగా నిర్వహించాలని సూచించారు. ఉప సంహరణకు అభ్యర్థులు హాజరైతేనే చేయాలని చెప్పారు. కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

మొదటి విడత 1,823 మంది పీవోలు



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రతీక్‌జైన్, యాస్మిన్ బాషా

వికారాబాద్/పరిగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు, మూడు విడతల పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం శనివారం పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్, ఎన్నికల సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాషా సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహించారు. రెండో విడతలో ఏడు మండలాల పరిధిలో 175 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా, ఒక్కో మండలంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 1,823 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,249 ఓపీవోలను ఈ ప్రక్రియ ద్వారా కేటాయించారు. మూడో విడతలో ఐదు మండలాల పరిధిలో 157పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా, 1,608 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,874 మంది ఓపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఒక నియోజకవర్గంలో పనిచేసే సిబ్బందిని మరో నియోజకవర్గంలో జరిగే ఎన్నికల నిర్వహణకు వినియోగిస్తున్నారు. తొలి విడత పోలింగ్‌కు ర్యాండమైజేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, వివిధ విభాగాల నోడల్ అధికారులు మంగీలాల్, జయసుధ, శ్రీనివాస్, మాధవరెడ్డి, రేణుకాదేవి పాల్గొన్నారు.

నిబంధనలు విధిగా పాటించాలి

ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు నిబంధనలు విధిగా పాటించాలని ఎన్నికల పరిశీలకులు యాస్మిన్ బాషా సూచించారు. పరిగి మండలం పరిధిలోని రంగాపూర్ క్లస్టర్‌లో నామినేషన్ల స్ర్కూటీనిని ఆమె పరిశీలించారు. పొరపాట్లు జరుగకుండా స్ర్కూటీనిని చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట డీఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నామినేషన్ తిరస్కరణ

- అంగన్వాడీ టీచర్ నామినేషన్ ఆమోదం

ఆదిభట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల పర్వం శుక్రవారం ముగిసింది. సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి బింగి రాములయ్య చర్లపటేల్‌గూడ క్లస్టర్‌లో రిటర్నింగ్ అధికారి సుధాకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా రాములయ్య అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవ్వాడిపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఒక వేళ పోటీ చేయాలనుంకుంటే ఉద్యోగానికి రాజీనామా చేసి స్ర్కూటినీ సమయానికల్లా అతడి ఉన్నతాధికారి జారీ చేసే నిరభ్యంతర పత్రాన్ని అందజేయాలి. కానీ సదరు సర్పంచ్ అభ్యర్థి శనివారం సాయంత్రం 5గంటల వరకు ఎన్వోసీ తీసుకరాకపోవడంతో రాములయ్య నామినేషన్‌ను ఆర్వో తిరస్కరించారు. ఈ మేరకు తిరస్కరణ కారణాన్ని సదరు నామినేషన్‌దారుడికి తెలియజేశారు. కాగా ఇదే స్థానంలో సర్పంచ్ అభ్యర్థిగా రాములయ్య భార్య గీత(అంగాన్వాడీ టీచర్) సైతం నామినేషన్ వేసింది. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీవోకు తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు దరఖాస్తు పెట్టుకుంది. దాంతో ఐసీడీఎస్ అధికారులు ఆమె రిసిగ్నేషన్‌ను అంగీరించి ఎన్నికల్లో పోటీకి నిరభ్యంతర పత్రం జారీ చేశారు. సర్టిఫికెట్‌ను ఆర్వోకు అందజేసింది. దీంతో మాజీ అంగన్వాడీ టీచర్ గీత నామినేషన్‌ను ఆర్వో ఆమోదిచగా ఎన్నికల్లో పోటీలో ఉండనున్నారు.

స్ర్కూటినిలో నామినేషన్ల తిరస్కరణ

యాచారం: గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లలో నిబంధనల ప్రకారం లేని వాటిని స్ర్కూటినిలో తిరస్కరించామని ఎంపీడీవో రాధారాణి, ఎంపీవో శ్రీలత తెలిపారు. 24 పంచాయతీలకు 172 నామినేషన్లు దాఖలవగా 120 నామినేషన్లను ఆమోదించామని 52 నామినేషన్లను తిరస్కరించామని, 230 వార్డు సభ్యులకు 831 నామినేషన్లు దాఖలవగా 69నామినేషన్లను తిరస్కరించి మిగతావి ఆదమోదించామన్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారి లింగ్యానాయక్

పెద్దేముల్/బొంరాస్‌పేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించిన వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి గన్నీ బ్యాగులు ఇస్తున్నారా తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రోజుకు ఒకలారీకి తగ్గకుండా ధాన్యం తరలించాలన్నారు. ఆయన వెంట డీఎంసీఎస్ మురళికృష్ణ, డీఎస్‌వో సుదర్శన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ.సైమన్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్ మండలంలో..

అలాగే బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు



యాచారం: చిన్నతూండ్లలో తనిఖీ చేస్తున్న పోలీస్‌లు

యాచారం/కొత్తూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మండలంలోని ప్రధాన రోడ్ల వెంట వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సాగర్-హైదరాబాద్ హైవేపై గున్గల్ గేట్ వద్ద, యాచారం స్టేషన్ వద్ద, మాల్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్నారు. వాహనదారుల వద్ద రూ.10వేల కంటే ఎక్కువ నగదుంటే డబ్బుకు సంబంధించి ఆధారాలను చూపితేనే వదుల్తామని సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. బ్యాంక్‌లో డ్రాచేస్తే రుజువు చూపాల్సిందేనని అధికారులు చెప్పారు. కొత్తూర్‌లోనూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. 44వ జాతీయ రహదారి, పాత జాతీయ రహదారిపై వాహనాలను పరిశీలించి, వాహనాల యజమానుల పేర్లు నమోదు చేస్తున్నారు. తనిఖీల్లో ఎస్ఐలు గోపాలకృష్ణ, సత్యాశీలారెడ్డి స్థానిక, ఎస్వోటీ పోలీసులు పాల్గొంటున్నారు.



కొత్తూరులో..

కొడంగల్ మండల జీపీవో అధ్యక్షుడిగా
పిట్ల శ్రీనివాస్ ఎన్నిక

కొడంగల్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండల జీపీవోల సంఘం అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నారని పిట్ల శ్రీనివాస్ శనివారం తెలిపారు. కొడంగల్ మండల గ్రామ పాలన అధికారుల కార్యవర్గ సమావేశంలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో జీపీవో మండల అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్ల శీనివాస్, ఉపాధ్యక్షులుగా శోభ, కోశాధికారి కావలి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ ఓంకుమార్, కమిటీ కార్యకలాపాలు పర్యవేక్షణ జానకిరాములు, ప్రొటోకాల్ ఇన్‌చార్జి ఎ.వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా ఎం.సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు.



క్రికెట్-కబడ్డీ క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో లక్ష్యాన్ని చేదించే క్రీడాకారులకు అంతర్జాతీయ గుర్తింపు, గౌరవం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. ఎన్టీఆర్ క్రీడోత్సవాల కమిటీ అధ్యక్షుడు నరేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్‌ను శనివారం నర్సింహులు ఆవిష్కరించారు. ఎన్టీఆర్ 103వ జయంతిని పురస్కరించుకుని యువతను క్రీడల వైపు మళ్లించేలా క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్న నరేష్‌ను బక్కని అభినందించారు. క్రికెట్ మొదటి బహుమతిగా 2లక్షలు, కబడ్డీ మొదటి బహుమతి రూ.లక్ష ప్రకటించడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, జి.భాస్కర్‌గౌడ్, అనంతయ్య, కానుగు రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి స్వాతిరెడ్డి

రాజీతో కేసుల సత్వర పరిష్కారం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజీతో కేసుల సత్వర పరిష్కారానికి కృషిచేయాలని 16వ అదనపు జిల్లా జడ్జి ఎస్.స్వాతిరెడ్డి కోరారు. ఈ నెల 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం కోర్టు సముదాయంలో పోలీసు, బ్యాంకు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. చిన్న చిన్న గొడవలు, వ్యక్తిగత దూషణలు, బ్యాంకు కేసుల్లో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగకుండా రాజీ కుదుర్చాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని జడ్జి కోరారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్

కొడంగల్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ధైర్యం నింపడమే ఫ్లాగ్‌మార్చ్ ఉద్దేశం అని సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే లక్ష్యంతో కొడంగల్ మండలం రుద్రారం, రావులపల్లి, అంగడి రైచూర్, పర్సాపూర్, హస్నాబాద్ గ్రామాల్లో సర్కిల్ పోలీస్ సిబ్బంది, టీజీఎస్పీ, ఏఆర్ పోలీసు సిబ్బంది కలిసి ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హిందువుల మనోభావాలను కించపరిస్తే సహించం



నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద హిందూ సంఘాల ఆందోళన

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : హిందువుల మనోభావాలను కించపరిస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. పోచారం, నారపల్లి, దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు బలవంతంగా అయ్యప్ప స్వామి దీక్షాదారుల దుస్తులను తీయించి కళాశాల యూనిఫాం వేయించడాన్ని నిరసిస్తూ శనివారం కళాశాల గేటు వద్ద ధర్నాకు దిగారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను కించపరిస్తే సహించేదలేదన్నారు. ఇతర మతాల వారు ఇష్టమైన దుస్తులు ధరించి సంప్రదాయాలు పాటిస్తే ఏమీ అనరు కానీ హిందువులు అయ్యప్పమాల ధరించి కాలేజీకి వస్తే వివక్ష ఎందుకు చూపుతున్నారని ప్రశ్నించారు. అయ్యప్పమాల తీయించిన అధ్యాపకులను, సిబ్బందిని విధుల తొలగించాలని డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్.. విద్యార్థికి, బీజేపీ, హిందూ సంఘాల నాయకులకు క్షమాపణ చెప్పడంతో ఆందోళన సద్దుమనిగింది. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలేష్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాముయాదవ్, రాజుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

సామాజిక సేవకులకు సత్కారాలు



సబియా సుల్తానా, శ్యాంసుందర్, శశిధర్‌లను సత్కరిస్తున్న హైకోర్టు జడ్జి నంద

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో సామాజికంగా సేవ చేసిన వారిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఘనంగా సత్కరించింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన నలుగురు సత్కారం పొందారు. శనివారం హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో సత్కారాలు జరిగాయి. న్యాయ వ్యవస్థలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేసిన షాద్‌నగర్ న్యాయవాదులు సన్నిదానం కృష్ణశర్మ, సబియా సుల్తానా, విద్యావేత్త హర్మల్ రవిప్రకాశ్, ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దకు చెందిన సామాజిక వేత్తలు గుడవర్తి శ్యాంసుందర్, మఠం శశిధర్‌లను హైకోర్టు జడ్జి సురేపల్లి నంద సన్మానించి, ప్రశంసాపత్రం, మెమొంటోలు అందజేశారు. వారికి తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమంలో భక్తులు

కడ్తాల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని భూనీలసమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం సుదర్శన హోమం, మహాకుంభాభిషేకం, పుష్పోత్సవ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు కొనసాగే ఈ ఉత్సవాలకు ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సుదర్శన హోమ ప్రారంభ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోమం,కుంబాభిషేకంలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. వేద పండితులు మెళ్లూరి వెంకటేశ్వర శర్మ, అర్చకులు తిరునగిరి శ్రీమన్నారాయణ, శ్రీధర్, వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. తొలిరోజు విఘ్నేశ్వర పూజ, దీపారాధన, పుణ్యాహవచనం, మండపారాధన, గణపతి హోమం, సుదర్శన హోమం, మహాలక్ష్మీ హోమం, లలిత, విష్ణు సహస్రనామ, భగవద్గీత పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హోమంలో పాలాది అంజనేయులు, గూడూరు భాస్కర్‌రెడ్డి-శారద, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి- స్వప్న, యాదయ్యగౌడ్-భారతమ్మ, సతీష్‌గౌడ్ -మాధవి దంపతులు కూర్చున్నారు. అనంతరం గూడూరు శ్రీనివాస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, నాయకులు రాయికంటి బిక్షపతి, కడారి రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, జంగారెడ్డి, హన్మనాయక్, చందోజీ, అంజయ్య, అశోక్, సత్యం, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, తిరుమలేశ్, బాచిరెడ్డి వెంకట్‌రెడ్డి, జి.శ్రీను, సాయిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రాంచందర్‌నాయక్, బోసు రవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కొనుగోలు కేంద్రాలకు పత్తిని లూస్‌గానే తరలించాలి

కొడంగల్ రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని విక్రయించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తెచ్చేప్పుడు ప్లాస్టిక్ సంచుల్లో కాకుండా లూస్‌గా(విడిగా) మాత్రమే తీసుక రావాలని జిల్లా మార్కెటింగ్ అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రైతులు పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో అమ్మకానికి తేవొద్దని, అలా చేస్తే నాణ్యత తగ్గుతుందని పేర్కొన్నారు. పత్తి నల్లబారి, తేమ శాతం పెరిగి రైతులకు మంచి ధర రాదని తెలిపారు. అంతగా కావాలనుకుంటే జాలి లాంటి జ్యూట్ బస్తాల్లో తెచ్చి కేంద్రం వద్ద వెంటనే బయటకు తీయాలని సూచించారు. రైతులు ఈ నిబంధనలు పాటించి పత్తిని లూస్‌గా(విడిగా) మాత్రమే తేవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా ఖేలో ఇండియా షూటింగ్ బాల్ ఎంపికలు



ఖేలో ఇండియా షూటింగ్ బాల్ ఎంపికకు హాజరైన బాలికలు

తాండూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాండూరులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖేలో ఇండియా షూటింగ్ బాల్ పోటీల ఎంపికలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యా యి. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాములు పర్యవేక్షణలో ఎంజేపీ గురుకుల పాఠశాలలో జరిగిన ఈ ఎంపికలకు షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ హాజరయ్యారు. గోపాలం మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశాలున్నాయన్నారు. ఉమ్మడి జిల్లా ఎంపికలు తాండూరులో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిభ చూపిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి ఈ నెల 13, 14 తేదీల్లో తాండూరు సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పంపుతామన్నారు. నైపుణ్యం ప్రదర్శించిన 25మంది బాలికలకు మెడల్స్ అందజేశారు. నిర్వహణ కార్యదర్శి రాములు, పీఈటీలు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ అధికారులను అడ్డుకున్న హిమాయత్‌నగర్ వాసులు



అధికారులతో మాట్లాడుతూన్న గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధి హిమాయత్‌నగర్‌లోని సర్వే నంబర్ 151లోని 30ఎకరాల ప్రభుత్వ భూమిలో హెచ్ఎండీఏ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ సిబ్బందితో కలిసి శనివారం చదును చేయిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తాము ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడతామని కోరగా అధికారులు నుంచి వెళ్లిపోయారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ఈ స్థలంలో ప్రభుత్వం వందలాది మంది నిరుపేదలకు 60గజాల చొప్పున ఇళ్ల పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు జాగాను వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయడం సరికాదని, ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు.

WANTED

★ సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, బౌన్సర్స్ M/F కావలెను. మంచి జీతం, డ్యూటీ 8 గం., 10 గం., 12 గం., సంప్రనాయక్ సెక్యూరిటీ ఉప్పల్ బస్టాండ్ దగ్గర, హైదరాబాద్ - 9951555983 / 9951555986 AJH-003652

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు.. మొదలైన ప్రచార పర్వం

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికల సమరంలో కీలక ఘట్టం నామినేషన్ల ఉపసంహరణల పర్వం ప్రశాంతంగా ముగిసింది. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలోని 22నామినేషన్ స్వీకరణ కేంద్రాల ఎదుట శనివారం ఉపసంహరణల అనంతరం బరిలోని అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించి పేర్లతో కూడిన జాబితాలను రిటర్నింగ్ అధికారులు ప్రదర్శించారు.

ఆమనగల్లు మండలంలో 13 సర్పంచ్ స్థానాలకుగాను కోనాపూర్ సర్పంచ్ పదవికి బెల్లంకొండ శ్రీలత ఒకే నామినేషన్ రావడంతో ఏకగ్రీవమైంది. మిగిలిన 12 సర్పంచ్ స్థానాలకు 40మంది అభ్యర్థులు, 112 వార్డులకు 20 ఏకగ్రీవం కాగా మిగలిన 92 వార్డులకు 258 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కడ్తాల మండలంలోని 24 సర్పంచ్ స్థానాలకుగాను 4 ఏకగ్రీవమయ్యాయి. గాన్గుమర్ల తండా సర్పంచ్‌గా సేవ్యనాయక్, గడ్డమీది తండా సర్పంచ్‌గా చిట్టిరమేశ్, రేఖ్య తండా సర్పంచ్‌గా పాత్లావత్‌లక్ష్మి, గోవిందాయిపల్లి సర్పంచ్‌గా బాణావత్ జానులు ఎన్నికయ్యారు. 20 సర్పంచ్ స్థానాలకు 63మంది పోటీలో ఉన్నారు. తలకొండపల్లి మండలంలో 32 సర్పంచ్‌లకు గాను బల్జులపల్లి తండా సర్పంచ్‌గా పాత్లావత్ విజయ, మాదాయిపల్లి సర్పంచ్‌గా గుల్ల సుధాకర్, కోరింతకుంట తండా సర్పంచ్‌గా మూడావత్ సరోజలు



ఆమనగల్లు : కోనాపూర్ నామినేషన్ కేంద్రం వద్ద గుర్తులు చూసుకుంటున్న అభ్యర్థులు

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 29 సర్పంచ్ స్థానాలకు 85 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు జిల్లా ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

కాగా కడ్తాల మండలం మైసిగండి గ్రామ పంచాయతీలో 10 వార్డులకు గాను ఏడు ఏకగ్రీమయ్యాయి. వారిని పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ తులసీరామ్‌నాయక్, సర్పంచ్ అభ్యర్థి ప్రేమజవహర్‌లాల్ నాయక్‌ల ఆధ్వర్యంలో గ్రామస్థులు సత్కరించారు.

పర్వేద, కొత్తపల్లి సర్పంచ్‌లు ఏకగ్రీవం

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మండలం పర్వేద సర్పంచ్‌గా ఎన్కతల సురేందర్‌గౌడ్‌తో పాటుగా గ్రామంలోని 10మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారి హతీక్ హుస్సేన్ శనివారం సాయంత్రం పర్వేద గ్రామపంచాయతీ వద్ద సురేందర్‌గౌడ్‌తో పాటుగా 10మంది వార్డు సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేసి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపసర్పంచ్‌గా చేగూరి సునీత ఎంపికయ్యారు. కొత్తపల్లి సర్పంచ్‌గా అకునాపురం బల్వంత్‌రెడ్డితో పాటు ఇద్దరు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బల్వంత్‌రెడ్డిని ఎమ్మెల్యే యాదయ్య సన్మానించారు.

మొయినాబాద్‌లో 9మంది వార్డు సభ్యులు

మొయినాబాద్ రూరల్ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సర్పంచ్, వార్డు పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. మొత్తం 19 గ్రామ పంచాయతీలు, 166 వార్డులున్నాయి. 9 వార్డులు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో సంధ్యరాణి తెలిపారు. మిగతా 157 వార్డు స్థానాలకు 621 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 19 సర్పంచ్ స్థానాలకు 134 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మాడ్గుల : మూడో విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో హనుమంతరెడ్డి ఎన్నికల అధికారి విజయలక్ష్మీకి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ వినయసాగర్, ఎన్నికల అధికారి విజయలక్ష్మి, ఆర్వో కేశవరెడ్డి తదితరులున్నారు.

యాచారం : సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు శుక్రవారం రాత్రి 11.45గంటల వరకు తీసుకున్నారు. ఐదు గంటల తరువాత నామినేషన్ కేంద్రాల్లోకి ఏ ఒక్కరినీ పోలీసులు అనుమతించలేదు. అధికారులు టోకెన్లు ఇచ్చి నామినేషన్ పత్రాలను తీసుకున్నారు.

క్రైం కార్నర్

ఎన్నికల కోడ్ ఉల్లంఘన.. ఆరుగురిపై కేసు నమోదు

చేవెళ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో న్యాలట గ్రామానికి చెందిన చాకలి సత్యనారాయణ, ఆయుగళ్ల సురేష్, ఆయుగళ్ల రాజు, గూడెపు కుమార్, సంధ్యపాటి మహేందర్, సంధ్యపాటి నర్సింలు బహిరంగ ప్రదేశంలో ప్రజాశాంతికి భంగం కలిగేటా కొట్లాడినందుకు వారిపై కేసు నమోదు చేశారు. చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య సమక్షంలో బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు.త

అంబేడ్కర్‌కు ఘన నివాళి

అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం నివాళి అర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు.



చేవెళ్ల : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



కడ్తాల : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ప్రజాసేవలో బీరంగూడ కుటుంబం



జగన్మోహన్‌రెడ్డి



జయప్రద



ప్రచారం నిర్వహిస్తున్న జయప్రద జగన్మోహన్‌రెడ్డి

కొత్తూర్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవే కర్తవ్యంగా బీరంగూడ కుటుంబ సభ్యులు ముందుకు సాగుతున్నారు. మండల పరిధిలోని తీగాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యుడు. జగన్మోహన్‌రెడ్డి సతీమణి బీరంగూడ జయప్రద 2001 నుంచి 2006 వరకు గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2018 నుంచి 2023 వరకు జగన్మోహన్‌రెడ్డి ఎంపీటీసీగా పనిచేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించారు. షాద్‌నగర్ బార్ అసోసియేషన్ ఛైర్మన్‌గా కూడా పలు పర్యాయాలు పనిచేశారు. ప్రస్తుత సర్పంచ్ ఎన్నికల్లో తీగాపూర్ గ్రామపంచాయతీని జనరల్ స్థానానికి కేటాయించారు. దాంతో గ్రామస్తుల కోరిక మేరకు బీఆర్ఎస్ తరఫున బీరంగూడ జయప్రద తిరిగి సర్పంచ్ పదవి కోసం ఎన్నికల బరిలో నిలిచి భారీ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తనను తిరిగి సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తానని జయప్రద హామీ లిస్తూ జోరుగా ముందుకు సాగుతున్నారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు : జెడ్పీ సీఈవో

తలకొండపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి తెలిపారు. తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లను, పోలింగ్ బాక్స్‌లను, బరిలోని అభ్యర్థుల జాబితాలను పరిశీలించి ఎంపీడీవో శ్రీకాంత్‌కు పలు సూచనలు చేశారు. పోలింగ్ బూత్‌ల వారిగా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

కేశంపేట : ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో నిర్వహించాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ పనులు పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లు తప్పులు లేకుండా సర్పంచ్, వార్డులవారిగా విభవించాలని ఎంపీడీవో రవి చంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్యలకు సూచించారు.

అయ్యప్ప దీక్షతో మానసిక పరివర్తన

● మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష తీసుకునే వారిలో మానసిక పరివర్తన పెరిగి, సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని పొందుతారని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆవరణలో అయ్యప్ప భక్తులకు శనివారం ప్రతాప్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష తీసుకుని మండలం పాటు నిత్యపూజలు చేసే వారిలో కోపం తగ్గుతుందని, మనస్సు స్థిరంగా ఉంటుందని, అనవసరమైన కోరికలు తగ్గుతాయని, మంచి పనులు మాత్రమే చేస్తారని అన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ, సామాజిక సేవ చేస్తారని ఆయన అన్నారు.

చించోడు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా





చించోడులో ప్రచారం చేస్తున్న ర్యాకల శ్రీనివాస్, తదితరులు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ర్యాకల శ్రీనివాస్ తెలిపారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గతంలో సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ ముందుకెళుతున్నారు. శనివారం గ్రామంలో ఆయన ప్రచారం చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే శంకర్ సహకారంతో గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని, తన హయాంలో సీసీ రోడ్లు నిర్మించినట్లు గుర్తు చేశారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే పూర్తి సహ కారం అందిస్తామని మాటిచ్చినట్లు చెప్పారు. గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసుకుందామని, తనకు సర్పంచ్‌గా అవకాశం ఇవ్వాలని ఓటర్లును కోరారు. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో మిగతా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తినా.. చించోడులో ఎలాంటి సమస్య రాకుండా చూసినట్లు చెప్పారు. పటేల్ కుంట తండా వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించానని తెలిపారు. కాగా, శ్రీనివాస్‌కు తోడుగా గ్రామంలోని యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొంటున్నారు.

మీర్జాగూడకు రూ.10 లక్షల నిధులు

● మంజూరు చేసిన చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

● ఏకగ్రీవమైన సర్పంచ్‌కు శుభాకాంక్షలు

చేవెళ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీపీ ఎన్నికల్లో చేవెళ్ల మండలంలో బీజేపీ మద్దతు సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవం కావడంతో ఆ పార్టీ బోణీ కొట్టింది. శనివారం సర్పంచ్ విత్‌డ్రాల్లో గ్రామంలోని 8వార్డులతో పాటు సర్పంచ్ స్థానం ఏకగ్రీవమయ్యాయి. దీంతో శనివారం రాత్రి బీజేపీ శ్రేణులు గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవమైన పర్వేద సుష్మ మల్లేష్‌ను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అభినందించారు. గ్రామ అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షలు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ఫోన్ ద్వారా ఎంపీ ప్రకటించారు. అంతకుముందు ఏకగ్రీవమైన నూతన సర్పంచ్ సుష్మ మల్లేష్‌ను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, శ్రీకాంత్, పత్తి సత్యనారాయణ, చీర శ్రీనివాస్, జయశంకర్ గౌడ్ తదితరులు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈమేరకు సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

గెలిపిస్తే గ్రామంలో ప్రగతి కాంతులు



మేనిఫెస్టో విడుదల చేస్తున్న గండెగల్ల నీలమ్మ అంజయ్య

కేశంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారంలో తమ ప్రభుత్వమే ఉందని.. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే బైర్కాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రగతి కాంతులు నింపుతానని, కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలంటూ కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థి గుండెగల్ల నీలమ్మ అంజయ్య బైర్కాన్‌పల్లిలో ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. శనివారం గ్రామపంచాయతీ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ.. తాను గెలిస్తే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. తాను గెలిచిన వెంటనే గోప్లాయ్‌కుంట తండా, తెట్టే కుంట తండాలలో సీసీ రోడ్ల నిర్మాణం, మురుగు నీటి కాలువల నిర్మాణంతో పాటు, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వివరించి పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ఓటర్లు తనను ఆదరించి కత్తెర గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆయన వెంట సభావత్ రూప్లా, యాదగిరిచారి, వెంకటేష్, రాజు, రషీదాబేగం, ఖాజ భాయ్ తదితరులు ఉన్నారు.

ఉంగరం గుర్తుకు ఓటుతో ప్రగతికి చోటు

ఎన్నికల ప్రచారంలో కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్



ఎన్నికల ప్రచారంలో బావండ్లపల్లి ఆనంద్

కడ్తాల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారు ప్రాంతాలకు సమాంతరంగా కడ్తాలను అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతానని కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. ఉంగరం గుర్తుకు ఓటు కడ్తాల ప్రగతికి చోటు అని పేర్కొన్నారు. ప్రజాభీష్టానికనుగుణంగా నడుచుకొని కడ్తాలలో ప్రగతికాంతులు నింపుతానన్నారు. కడ్తాల బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థిగా బరిలో నిలిచిన బావండ్లపల్లి ఆనంద్ శనివారం పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంప శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. తనకు కేటాయించిన ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆనంద్ కోరారు. ఉంగరం గుర్తుకు ఓటు కడ్తాల ప్రగతికి చోటు అని ఆయన అన్నారు. కడ్తాలలోని అన్నివార్డుల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజల ఇబ్బందులు తీరుస్తానన్నారు. పదవులు ఉన్నా.. లేకపోయిన దశాబ్దాలుగా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని ఆనంద్ తెలిపారు. పేదలకు, బాధిత కుటుంబాలకు సాయమందించి అండగా నిలిచానని ఆయన తెలిపారు. ఒక్కసారి సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే అభివృద్ధిచేసి చూపుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అద్భుత ప్రగతి సాధించాయన్నారు. కడ్తాల సర్పంచ్‌గా తాను ఎంతగానో అభివృద్ధి చేసి రాష్ట్ర స్థాయిలో గ్రామానికి గుర్తింపు తెచ్చానని చెప్పారు. ఆనంద్‌ను మరోసారి గెలిపిస్తే ప్రజలు కోరుకున్న విధంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉంగరం గుర్తు చూపిస్తూ జీఎల్ఎన్ రెడ్డి, రామకృష్ణ, గంప వెంకటేశ్‌లతో కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న బావండ్లపల్లి ఆనంద్

బీసీలకు రిజర్వేషన్లు రాజ్యాంగ హక్కు

షాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధమైన హక్కు అని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం సాయి ఈశ్వర్‌చారి బలిదానం చేసుకోవడంతో షాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, న్యాయం, సమానత్వం కోసం వరుసగా బలిదానాలు జరుగుతున్నాయని, నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శ్రీకాంత్‌చారి తన ప్రాణాలను అర్పించగా, నేడు బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధన కోసం సాయి ఈశ్వర్‌చారి ప్రాణత్యాగం చేశారన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, నర్సింహులు, రాహుల్, అశోక్, వెంకటయ్య, రాము, తదితరులున్నారు.

అదనపు తరగతి గది నిర్మించాలి

చౌదరిగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గది కొరతతో ఇబ్బందులు పడుతున్నామని, అదనపు గది నిర్మించాలని హెచ్ఎం నీలా మోహన్ నాయక్ అన్నారు. ఈమేరకు శనివారం పాఠశాల ఆవరణలో ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఆయన సమస్యను విన్నవించారు. ఆదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి అదనపు తరగతి గది నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

కడ్తాల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అన్మాస్‌పల్లిలో పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరగా మాజీ సర్పంచ్ శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామకృష్ణ, సర్పంచ్ అభ్యర్థి నేనావత్ భుజ్య శ్రీనులతో కలిసి పార్టీలోకి స్వాగతించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

ఇంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మృతి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఇంద్రారెడ్డి కుటుంబ ముఖ్య అనుచరుడు మృతిచెందాడు. పెద్దమంగళారం గ్రామానికి చెందిన మంగలి జంగయ్య(45) శనివారం సాయంత్రం గుండెపోటుతో మరణించాడు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జంగయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అవకాశమిస్తే నిస్వార్థంగా సేవలందిస్తా

ఎన్నికల ప్రచారంలో కడ్తాల కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి



కత్తెర గుర్తు చూపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి

కడ్తాల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడ్తాల సర్పంచ్‌గా ఆదరించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలు అందిస్తానని కాంగ్రెస్ పార్టీ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కడ్తాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా సాధిస్తానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ మద్దతు కడ్తాల అభ్యర్థి రాయికంటి భిక్షపతి శనివారం వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పట్టణాధ్యక్షుడు మాలె మల్లేశ్‌గౌడ్, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి కత్తెర గుర్తుకు ఓటేసి సర్పంచ్‌గా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కడ్తాల అభివృద్ధికి వార్డు సభ్యుడిగా తానెంతగానో కృషి చేశానని, సర్పంచ్‌గా తనకు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధికి పాటుపడుతానన్నారు. స్థానిక ప్రజల సమస్యలు తెలుసునని.. వాటి పరిష్కారానికి గెలిపిస్తే సేవకుడిగా కృషి చేస్తానని భిక్షపతి పేర్కొన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, అంతర్గత రోడ్లు, వీధిదీపాల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తానని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ప్రజా సేవలోనే ఉన్నానని.. సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే ప్రజలకు సేవచేయడంతో పాటు పదవికి గుర్తింపు తెస్తానన్నారు. కాగా, భిక్షపతి విజయం కోసం ఆయన సతీమణి జయసుధ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టు పెట్టి ఒక్కసారి అవకాశం కల్పిస్తే సేవకులుగా పనిచేస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, యాదయ్య, చెన్నయ్య, జంగయ్య, పాండు, నర్సింహ తదితరులు సర్పంచ్ అభ్యర్థి భిక్షపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు జహంగీర్‌అలీ, బుచ్చయ్య, రాజేందర్‌గౌడ్, రాంచందర్ నాయక్, మహేశ్, సత్యం యాదవ్, భానుకిరణ్, ఇమ్రాన్‌బాబా, సందీప్, చంద్రశేఖర్, శ్రీకాంత్, శ్రీను, బోసు రవి, జహంగీర్‌బాబా, యాదగిరిరెడ్డి, మల్లేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారికి భిక్షపతి, హన్మనాయక్, నర్సింహ లక్ష్మయ్యలతో కలిసి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

వేములనర్వను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఇంటింటి ప్రచారంలో గాండ్ల విజయలక్ష్మి అశోక్

కేశంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా తనను గెలిపిస్తే వేములనర్వ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిచేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి గాండ్ల విజయలక్ష్మిఅశోక్ ఓటర్లకు వాగ్ధానం చేశారు. శనివారం వేములనర్వ, చౌదరిగూడ గ్రామాల్లోని వార్డు అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తును చూపిస్తూ ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను గెలిచిన వెంటనే వేములనర్వ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇంటింటికీ రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించడమే ప్రథమ లక్ష్యమని, గ్రామాల్లో మురుగు నీటి కాలువలు, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. గాండ్ల విజయలక్ష్మి వెంట మాజీ వైస్‌ఎంపీపీ అనురాధ పర్వతరెడ్డి, మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చుక్కా రాఘవేందర్, పర్వతాలు, అవుసల నర్సింహ తదితరులు పాల్గొన్నారు. కాగా, గాండ్ల విజయలక్ష్మి అశోక్‌కుమార్‌ల కూతురు స్రవంతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బెంగళూరులో నివాసముంటోంది. శనివారం వేములనర్వ వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టింది.

ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి మరో మారు కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ సత్తా చాటాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పిలుపు నిచ్చారు. రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని ఆయన కోరారు. కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. కడ్తాల మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయమని, ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు సాగిస్తున్న కుట్ర రాజకీయాలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని కసిరెడ్డి పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో 90 శాతానికి పైగా సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంటుందన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, విక్రమ్ చారి, రాఘవేందర్, శ్రీశైలం, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీ పల్లిని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతా



యాదమ్మకు మద్దతుగా బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఉంగరం గుర్తుతో గ్రామస్తుల భారీ ఊరేగింపు

కొత్తూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శేరిగూడబద్రాయపల్లి గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మె యాదమ్మ తెలిపారు. తమ మద్దతుదార్లతో కలిసి గ్రామంలో భారీ ఉరేగింపు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామ నడిబొడ్డులో మహిళలు పెద్దయెత్తున బతుకమ్మ ఆడి యాదమ్మకు మద్దతుగా నిలిచారు. తన కుమారుడు ఎమ్మె సత్యనారాయణ గ్రామసర్పంచ్‌గా పనిచేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, తన కోడలు ఎమ్మె శ్రీలతా సత్యనారాయణ కొత్తూర్ జడ్పీటీసీగా పనిచేసి భారీయెత్తున నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దినట్లు గుర్తుచేస్తూ ఎన్నికల ప్రచారం కొనసాగించారు. సర్పంచ్‌గా తనను ఆశీర్వదిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించి, సమస్యల పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు.